



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అటకెక్కిన ఆధునీకరణ..!

◆ కాలువలకు తరచూ గండ్లు ◆ పుష్కలంగా నీరున్నా వినియోగంలో తప్పని అవస్థలు

హెచ్ఎల్సీ కాలువ తెగిపోవడంతో బయటకు వెళ్తున్న నీరు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాగునీటి కాలువల ఆధునీకరణను ప్రభుత్వాలు అటకెక్కించాయి. దశాబ్దాలుగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఎప్పుడో నిర్మించిన కాలువల గట్లు బలహీనపడి ఎక్కడికక్కడ తెగిపోతున్నాయి. నీరు వచ్చే సమయంలో సకాలంలో తీసుకోలేక అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి.

17 ఏళ్లుగా అటకెక్కిన హెచ్ఎల్సి ఆధునీకరణ

అనంతపురం జిల్లాకు నిఖర జలాలున్న ఏకైక జలవనరు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. ఎటువంటి లిఫ్టులు లేకుండా గ్రావిటీపై వచ్చే ఈ నీరే అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ప్రధాన నీటి వనరు. తుంగభద్ర డ్యామ్ నుంచి వచ్చే ఈ కాలువ కర్నాట రాష్ట్రంలో 105 కిలోమీటర్లు ప్రయాణించాక ఆంధ్రప్రదేశ్‌లోని బొమ్మనహాళ్ మండలంలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి 189వ కిలోమీటరు వరకు ప్రధాన ఎగువ కాలువ ఉంది. ఈ కాలువ కింద ఒక్క అనంతపురం జిల్లాకే కాకుండా అటు కడప, ఇటు కర్నూలు జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు నీటిని అందించే అవకాశముంది. దీని ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లా దాహార్తి కూడా తీరుతోంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈప్రాజెక్టు ఆధునీకరణను మాత్రం ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఎప్పుడో నిర్మించిన ఈప్రాజెక్టు ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు ఆధునీకరణించాలని 2008లో రూ.458.42 కోట్లతో పనులు చేపట్టారు. సీజన్‌లో కాకుండా ఆన్‌సీజన్‌లో పనులు చేసి నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలన్నది టెండర్లు పిలిచిప్పటి లక్ష్యం. అంటే 2012 నాటికి పూర్తి చేయాలన్నది సంకల్పించారు. అది కూడా ప్రవాహ సామర్థ్యాన్ని 2400 క్యూసెక్కుల నుంచి 4200 క్యూసెక్కులకు పెంచాలని నిర్ణయించి ఆరు ప్యాకేజీల్లో టెండర్లు పిలిచారు. ఆ మేరకు పనులు రెండేళ్ల పాటు సజావుగా సాగాయి. సుమారు రూ.309 కోట్లు ఖర్చు పెట్టారు. అంతకు ముందున్న కాలువను వెడల్పు చేసే పనులు చేపట్టారు. కాని స్ట్రక్చర్ల నిర్మాణాలు ఆపేశారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు 2014 నుంచి ఉన్న టిడిపి, 2019లో వచ్చిన వైసిపి పట్టించుకోలేదు. పైగా 2020లో దీన్ని అప్రాధాన్యత పనుల కింద పరిగణించి వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. ఇంకో ఐదేళ్లపాలు ఈ పనులు చేయడానికి వీల్లేదన్న నిబంధన కూడా పెట్టింది. ఈ ఏడాదితో ఆ నిబంధన పూర్తవనుంది. కాలువ వెడల్పు కోసమని మట్టి తవ్వి స్ట్రక్చర్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఎక్కడిక్కడ స్ట్రక్చర్లు బలహీనపడి కూలిపోతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు అధికారంలోకొచ్చిన టిడిపి ప్రభుత్వం రూ.30 కోట్లు నిధులు విడుదల చేసింది. అయితే ఇవి పూర్తి స్థాయి ఆధునీకరణకు కాదు. ఎక్కడైనా తీవ్రమైన సమస్యలుంటే వాటిని సరిచేయడానికి ఇచ్చారు. మరమ్మతులు చేసిన చోట అలాగుంటే ఇతర ప్రాంతాల్లో ఇప్పుడు కాలువ గండ్లు పడి నీరు వృథాగా పోతుండటం గమనార్హం.



జల్లిపల్లి వద్ద పిఎబిఆర్ కుడికాలువకు గండిపడడంతో వృథాగా వెళ్తున్న నీరు

ఇతర కాలువల పరిస్థితి ఇదే తీరే

ప్రధాన కాలువ పరిస్థితి ఇలాగుంటే ఇతర కాలువల పరిస్థితి అదేతీరుగా ఉంది. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. 2015లో గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ ఆధునీకరణకు రూ.234.67 కోట్లతో చేపట్టారు. రూ.188 కోట్ల పనులు చేశాక మధ్యలో ఆపివేశారు. ఇక మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ రూ.509 కోట్లతో చేపట్టి రూ.205.79 కోట్లు ఖర్చు చేసి మధ్యలో నిలిపివేశారు. ఇలా ప్రధాన కాలువల ఆధునీకరణ అటకెక్కడంతోపాటు ప్రాజెక్టు సాధారణ నిర్వహణ నిధులు మంజూరవడం లేదు. వీటన్నింటి మూలంగా అనంతపురం జిల్లాలో సాగునీటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నీరు వస్తోందో ఇంజినీర్లు బిక్కుబిక్కుమనే పరిస్థితుల్లో ఉంటున్నారు. ఎప్పుడు ఎక్కడ గండిపతుందోనని భయపడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

10 నుంచి టెట్ పరీక్ష

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈనెల 10 నుంచి 21వతేదీ వరకు టెట్ (ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో టెట్ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టెట్-2025 పరీక్ష ఈనెల 10 నుంచి 21వతేదీ జరగనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 7 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. టెట్ పరీక్ష ప్రతిరోజూ రెండు సెషన్లలో జరుగుతుందన్నారు. మొదటి సెషన్ ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 2-30 గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జున, తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిఇఒ ప్రసాద్ బాబు, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు ఏర్పాట్లు

జిల్లాలో ఈనెల 21వతేదీన వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులతో పల్స్‌పోలియోపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 2,84,774 మంది చిన్నారులు (0-5 సంవత్సరాల మధ్య) ఉన్నారన్నారు. వీరిందరికి 21న పల్స్‌పోలియో చుక్కలు వేయాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

498 అర్జీల స్వీకరణ

అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో సోమవారం నాడు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ ఓ.ఆనంద్ వినతిపత్రాలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జున, తిప్పేనాయక్‌తో పాటు ఆయా శాఖల అధికారులతో కలిసి 498 అర్జీలను స్వీకరించారు. అర్జీలను క్షణ్ణంగా పరిశీలించి వేగవంతంగా వాటికి పరిష్కారం చూపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి



ప్రభాకర్(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-రాప్తాడు

అప్పుల బాధతాళలేక ఆత్మహత్యకు యత్నించిన రైతు సోమవారం మరణించారు. ఇందుకు సంబంధించి బాధిత రైతు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... రాప్తాడు మండలం భోగినేపల్లి గ్రామానికి చెందిన రైతు చిత్ర ప్రభాకర్(40) వరి, వేరుశనగ పంటలను సాగు చేశాడు. పంటల సాగు నిమిత్తం దాదాపు రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. గిట్టుబాటు ధరలేక పంటల్లో కనీసం పెట్టుబడులు కూడా చేతికందలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం కన్పించక ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం నాడు మరణించాడు. రైతు ప్రభాకర్ ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, రాప్తాడు మండల టిడిపి ఇన్‌ఛార్జి ధర్మవరపు మురళి సూచనల మేరకు మండల టిడిపి నాయకులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కురువ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి గంగలకుంట రమణ, ఎస్సీ సెల్ కన్వీనర్ పాలచర్ల ముత్యాలప్ప, సర్పంచ్ ఉజ్జినప్ప మాట్లాడుతూ రైతు కుటుంబానికి కూటమి ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బిహెచ్ రాయుడు

ప్రజాశక్తి-కూడేరు

ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి మొక్కజొన్న రైతాంగానికి రక్షణ కల్పించాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బిహెచ్ రాయుడు డిమాండ్ చేశారు. సోమవారం కూడేరు మండల పరిధిలోని ముద్దలాపురం గ్రామంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేద్యం ఖర్చులు పెరుగుతున్నప్పటికీ, పంటకు మద్దతు ధర లభించకపోవడంతో మొక్కజొన్న రైతులు అప్పుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ప్రయివేట్ మార్కెట్‌లో కేవలం రూ.1700 నుంచి రూ.1800 మాత్రమే పొందుతున్నారన్నారు. కొన్నిచోట్ల ఇంకా తక్కువ ధరలే లభిస్తున్నాయన్నారు. దీంతో పెట్టుబడి కూడా రాక రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కడదరకుంట వెంకటేష్, వీరప్ప, స్థానిక రైతుసంఘం నాయకులు మల్లికార్జున, రమేష్, రామాంజినేయులు, మేకల పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ధ్యేయమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. సోమవారం స్థానిక ప్రజావేదిక వద్ద ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించారు. ఇందులో భాగంగా పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు పలు సమస్యలపై వినతులను అందజేశారు. ముఖ్యంగా నార్త్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న కాలనీకి సీసీ రోడ్డు వేయాలని, బలిజ కళ్యాణ మండపం వెనుక విద్యుత్ సౌకర్యం కల్పించాలని మహిళలు మొరపెట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మురళి, అబ్దుల్ రహీమ్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలతో ప్రాణాలమీదకు తెస్తారా.? : సిపిఎం

గాయపడిన సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డిని ఆదుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అభిమానం పేరుతో విచ్చలవిడిగా అనంతపురం నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, అవి విరిగిపడి అమాయకుల ప్రాణాల మీదకు తెస్తారా అంటూ సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి ప్రశ్నించారు. అనంతపురం నగరం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు నగరంలోని బళ్లారి బైపాస్ హైవేలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు సోమవారం నాడు విరిగి పడ్డాయి. ఈ సమయంలో ఈ రోడ్డుపై వెళ్తున్న బుక్కరాయసముద్రం మండలం, కొట్టాలపల్లి గ్రామానికి చెందిన సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి స్పందించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తున్న సమయంలో సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డిలపై ఫ్లెక్సీలు పడ్డాయన్నారు. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుని, గాయపడిన వారి వైద్య చికిత్సలకు అయ్యే ఖర్చు మొత్తం మున్సిపల్ కమిషనర్ బాధ్యత తీసుకోవాలన్నారు. అధికార కూటమి నేతలు విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు, కమ్యూనిస్టు పార్టీలు చిన్న జెండాలు కట్టినా, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వెంటనే తొలగించే అధికారులకు కూటమి నేతలు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు కనిపించడం లేదాన్నారు. ఇప్పటికైనా మున్సిపల్, పోలీసు అధికారులు స్పందించి అనుమతి లేకుండా ఫ్లెక్సీలు కట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థల వసూళ్లపై చర్యకు వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఐద్వా నాయకులు

జిల్లాలో మైక్రో ఫైనాన్స్ సంస్థల అధిక వడ్డీల వసూళ్ళు, బెదిరింపులు, అక్రమ వసూళ్లను అరికట్టాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని మహిళలు, పేద కుటుంబాలు, స్వయం సహాయ సంఘాల సభ్యులపై మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపులు ఎక్కువయ్యాయని తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రత్యేక మైక్రో ఫైనాన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని కోరారు.

'ఉపాధి' పనులు కల్పించాలి

వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలు ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వ్యకాసం ఆధ్వర్యంలో తహశీల్దార్ శేషారెడ్డి, ఎపిఒ భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా సంవత్సరంలో 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. హార్టికల్చర్ పథకం కింద పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులకు బిల్లులు విడుదల చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో వీధిలైట్లు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, మునెప్ప, పుల్లయ్య, వెంకటస్వామి, నాట్యమండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సూర్యప్రకాష్, లక్ష్మీపతి, వెంకటాచలం, వెంకటస్వామి, సుంకన్న, నాట్యమండలి రామాంజనేయులు, పుల్లయ్య, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షులుగా రవీంద్ర

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులుగా డి.రవీంద్ర ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.పాపారావు, రాష్ట్ర అధ్యక్షులు సంసాని శ్రీనివాసరావు, ఏపి జేఏసి అమరావతి ఛైర్మన్ ఆర్ఎన్.దివాకర్‌రావు తెలిపారు. నూతన కమిటి ఎన్నికైన నేపథ్యంలో సోమవారం ఆ కమిటీ నాయకులు కలెక్టర్ ఓ.ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించి నూతన కమిటిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్‌ల సంఘం తిరుపతి అధ్యక్షులు దేవరాజు, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మన్న, జిల్లా కోశాధికారి ఆర్ఎం.బాషా, గౌరవ అధ్యక్షులు రామ్ గోపాలు, అసోసియేట్ అధ్యక్షులు ఎస్.డెవిడ్, ప్రచురణ కార్యదర్శి అదినారాయణ, గౌస్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

విజయ'దీపిక'కు అపూర్వ స్వాగతం

◆ మడకశిరలో భారీ ర్యాలీ
◆ పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ
◆ మడకశిర ఇండోర్ స్టేడియంకు దీపిక పేరు



దీపికను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మాట్లాడుతున్న దీపిక



దీపిక విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-మడకశిర టౌన్

అంధుల మహిళా టి-20 ప్రపంచ కప్‌ను భారత్‌కు అందించిన జట్టుకు సారథ్యం వహించిన కెప్టెన్ దీపిక సోమవారం నాడు తన స్వగ్రామానికి విచ్చేశారు. మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం తంబాలహట్టి గ్రామానికి చెందిన దీపిక ఇటీవల అంధుల క్రికెట్ ప్రపంచకప్‌ను దేశం గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించారు. దేశానికి సారథ్యం వహించిన దీపికను మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆధ్వర్యంలో సోమవారం నాడు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల వరకు దీపికతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ జాతీయ పతాకాలను చేతబట్టి భారత్ మాతాకూ జై.. దీపికకు జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో ముందుకు నడిచారు. అనంతరం జూనియర్ కళాశాలలో ఏర్పాటు సన్మాన సభను నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలో ప్రతిభకు కొదవలేదని, అవకాశాల్ని అందిపుచ్చుకుని ముందుకు సాగితే విజయం ఎలా వరిస్తుంది అనేదానికి దీపిక నిదర్శనం అన్నారు. ప్రపంచం గర్వించే రీతిలో అంధుల క్రికెట్‌కు కెప్టన్‌గా ఉండడమే కాక, ప్రపంచకప్‌ను అందించిన అమ్మాయి మన ప్రాంతం వాసి కావడం అభినందనీయం అన్నారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ మడకశిర ముద్దుబిడ్డ దీపిక సాధించిన విజయంతో దేశంలోనే మడకశిరకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. దీపిక విజయోత్సవ ర్యాలీ యువతకు స్ఫూర్తిదాయకంగా ఉండాలన్న సదుద్దేశంతోనే బహిరంగంగా సన్మాన సభను ఏర్పాటు చేశామన్నారు. తంబాలహట్టి నుంచి మొదలైన దీపిక ప్రస్థానం ప్రధాన మంత్రి, రాష్ట్రపతి, ముఖ్యమంత్రులు అభినందించే స్థాయికి చేరిందన్నారు. ఎమ్మెల్యే సింధూర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు దీపికను ఆదర్శంగా తీసుకుని ఎదగాలని ఆమె పేర్కొన్నారు. 'కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ దీపిక చూపు లేదని నిరుత్సాహ పడకుండా కలలను నిజం చేసేందుకు కష్టపడి సాధించిన విజయం జిల్లాకే గర్వకారణం అన్నారు. మడకశిర ఇండోర్ స్టేడియంకు దీపిక ఇండోర్ స్టేడియం అని నామకరణం చేస్తామని తెలిపారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ దీపిక విజయం ప్రతి విద్యార్థి యువత స్ఫూర్తితో తీసుకుని రాణించాలని పేర్కొన్నారు. సినీ నటుడు సాయికుమార్ మాట్లాడుతూ దీపిక లాంటి యువతులను ప్రతి ఒక్క విద్యార్థి ఆదర్శంగా తీసుకుని జీవితంలో విజయం సాధించాలని తెలియజేశారు. విజయానికి పేదరికం, అంధత్వం అడ్డు కాదని దీపిక నిరూపించిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ మడకశిర ముద్దుబిడ్డయినటువంటి దీపిక సాధించిన విజయం మడకశిరకే గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం దీపికను అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ మూర్తి, రాధాకృష్ణ, వక్రీ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఛైర్మన్ నరసింహ రాజు, డాక్టర్ రవి శేఖర్, క్రికెట్ అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తింపునిచ్చిన విజయం : దీపిక

దేశానికి ప్రపంచ కప్‌ను అందించిన ఘనత తనకు గుర్తింపును ఇచ్చిందని కెప్టెన్ దీపిక తెలియజేశారు. తాను 2019లో క్రికెట్‌లోకి వెళ్లిన సమయంలో అంధుల క్రికెట్‌ను ప్రోత్సహిస్తున్న మహంతిష్ ఆధ్వర్యంలో కర్ణాటకలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం ఎంతగానో తోడ్పాటును అందిచిందన్నారు. తనకు దక్కిన ఈ విజయంతో మా తల్లిదండ్రులు నేడు గర్వంగా తలెత్తుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 10 లక్షల రూపాయలు ఆర్థిక సహకారాన్ని అందించడమే కాకుండా తనను మట్టిలో మాణిక్యం అంటూ అభినందించడం ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జీవితంలో విజయం సాధించేలా అందరూ ముందుకు సాగాలని విద్యార్థులకు దీపిక పిలుపునిచ్చారు.

దీపికకు విరాళాలు

అంధుల క్రికెట్‌లో ప్రతిభ చూపిన దీపికకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు విరాళాలు ప్రకటించాయి. పుట్టపర్తి జిల్లా కేంద్రంలో పది సెట్లు స్థలాన్ని దీపికకు ఇస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ రూ.2.16 లక్షలు, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు రూ.2లక్షలు, యాదవ సంఘం రూ.లక్ష, సింగల్ విండో అధ్యక్షులు రూ.లక్ష, అమరాపురం తెలుగుదేశం పార్టీ నాయకులు రూ.50వేలు, ఒక్కళిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ రూ.50వేలు, జెడ్పిటిసి ఉమేష్ 10 వేల రూపాయల చెక్కులను దీపికకు అందజేశారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుత్తి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్నవిఆర్ఎలు

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ జి.పుణ్యవతికి ఎపి విఆర్ఎ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ తరహాలో విఆర్ఎల అందరికీ పేస్కేల్ అమలు చేయాలన్నారు. నామినీలుగా పని చేస్తున్న వారిని విఆర్ఎలుగా నియమించాలన్నారు. అర్హులందరికీ 70 శాతం ఉద్యోగాన్నతి కల్పించాలన్నారు. కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు. ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 16వ తేదీన మంగళగిరిలో విఆర్ఎ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ధర్నాకు పిలుపునిచ్చిందన్నారు. ధర్నాకు విఆర్ఎలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామా రెవిన్యూ సహాయకుల సంఘం నాయకులు నారాయణస్వామి, సుధాకర్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర హక్కులపై కేంద్రం పెత్తనం తగదు

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్ర హక్కులపై పెత్తనం చెలాయించాలని చూడటం తగదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని రాష్ట్రాల హక్కులను హరించే విధంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ముఖ్యంగా విద్యుత్, విత్తన బిల్లులు తీసుకురావడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం విద్యుత్ రాష్ట్రాల జాబితాలో ఉందన్నారు. రాష్ట్ర పరిధిలో ఉన్న అంశంపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చెలాయించడం ఎంత మేరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యుత్ బిల్లుతో దళితులు గిరిజనులు, పేద, బడుగు బలహీన వర్గాలకు ఇచ్చే విద్యుత్ రాయితీలకు ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. చిన్న చిన్న పరిశ్రమలకు కూడా ఇచ్చే ఉచిత విద్యుత్ భవిష్యత్తులో ఉండబోదన్నారు. అదేవిధంగా విత్తన బిల్లు 2025 పూర్తిగా ప్రయివేట్, కార్పొరేట్ విత్తన కంపెనీల ప్రయోజనాల కోసం తెచిచనట్లు ఉందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆయా బిల్లులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

విద్యుత్, సీడ్ బిల్లులను ఉపసంహరించాలి

రైతుసంఘాల ఆధ్వర్యంలో బిల్లు పత్రాల దహనం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ బిల్లు, సీడ్ బిల్లులను తక్షణమే ఉప సంహరించుకోవాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద విద్యుత్, సీడ్ బిల్లుల ప్రతులను దహనం చేశారు. రైతు సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, మల్లికార్జున, జిల్లా అధ్యక్షులు బి.హెచ్.రాయుడు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్ప యాదవ్ తదితరులు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీడ్ బిల్లుపై రైతులు, రైతు సంఘాల అభిప్రాయాలు చెప్పటానికి డిసెంబర్ 10 వరకు పెంచాలన్నారు. నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతే పరిహారం ఇవ్వలేని చట్టంలో నిబంధన పొందుపరచలేదన్నారు. విత్తన బిల్లును మోడల్ చట్టంగా చేసి రాష్ట్రాలు తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్పుకునే అవకాశం కల్పించాలన్నారు. కేంద్రం, రాష్ట్రాల అధికారాలను హరించకుండా చూడాలన్నారు.విత్తన కంపెనీలు తమ విత్తనాలను ప్రభుత్వ సంస్థల ద్వారానే ధ్రువీకరణ తప్పని సరిగా పొందాలన్నారు. విత్తన ధరలు, సరఫరా, నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలన్నారు. నకిలీ విత్తనాలను జరిమానాతో పాటు వెంటనే నిషేధం విధించాలని నిబంధన ఉండాలన్నారు. రైతులు, రైతు సంఘాల అభిప్రాయాలు తీసుకున్న తరువాతే పార్లమెంట్‌లో బిల్లు ఆమోదానికి పెట్టాలన్నారు. విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. రైతాంగానికి ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగించాలన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్లు పెట్టే విధానానికి స్వస్తి పలకాలన్నారు. పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, పండ్ల తోటల రైతు సంఘం కార్యదర్శి వి.శివారెడ్డి, సంజీవరెడ్డి, వెంకటరామిరెడ్డి, రైతు సంఘాల నాయకులు నీల్లపాల రామకృష్ణ, వీటి రామంజనేయులు, బండి రామకృష్ణ, గోపాలకృష్ణ, మన్నీల వెంకట రాముడు, నాగేషు, చలపతి తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న రైతుసంఘాల నాయకులు

బుక్కరాయసముద్రం : విద్యుత్ ప్రయివేటీకరణను నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ముసాయిదా బిల్లు ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పండ్ల తోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప మాట్లాడుతూ విద్యుత్ ప్రయివేటీకరణ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టం చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, ఎస్.వెంకటరామిరెడ్డి, సిఐటియు మండల సెక్రెటరీ నాగేంద్ర, వేణు, పుల్లయ్య, అంకాలు, బద్రి, చిన్నరాయుడు, హనుమంతు, పెద్ద వెంకటేష, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్, విత్తన బిల్లులను వ్యతిరేకిస్తూ సోమవారం ఉరవకొండ, వజ్రకరూరు మండల కేంద్రాల్లో సంబంధిత బిల్లుల జీవో ప్రతులను రైతు, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్, జిల్లా సహాయ కార్యదర్శి విరుపాక్షి, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, కౌలు రైతుసంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు, రైతుసంఘం నాయకులు సీనప్ప, సురేష్, సూరినారాయణ, రైతుసంఘం వజ్రకరూరు మండల కార్యదర్శి సుధాకర్, రైతుసంఘం నాయకులు వెంకటేసులు, చిన్న, పెద్దన్న, షేక్షావలి, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా 'శక్తి' యాప్

నార్పల : మహిళలు శక్తి యాప్‌ను ఉపయోగించుకుంటే రక్షణ కవచంగా ఉంటుందని ట్రైనింగ్ ఎస్ఐ గౌతం సూచించారు. ఎస్‌పి పి.జగదీష్ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో అనంతపురం రూరల్ సబ్ డివైజన్ శక్తి టీం శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. నిర్వహించారు. ఇందులో భాగంగా గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. ఈ సందర్భంగా గౌతం మాట్లాడుతూ మొబైల్ వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో మీ వ్యక్తిగతంగా ఫొటోలు పెట్టరాదన్నారు. యువతులు, మహిళలు శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలప్ప, హెచ్‌ఎం నాగేష్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-శింగనమల

విద్యార్థులు చదువుతోపాటు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ఎంఇఒ శివప్రసాద్, ఎస్ఆర్ఐటి కళాశాల ఉప ప్రధానాచార్యులు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిన్నమట్లగొంది గ్రామంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 విభాగం ఆధ్వర్యంలో సేవా శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లత, స్మార్ట్ విజన్ ఆసుపత్రి మేనేజర్ రాజగోపాల్, ఎన్ఎస్ఎస్ యూనిట్ పిఒ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-శెట్టూరు

కళ్యాణదుర్గంలోని ప్రజావేదికలో శెట్టూరు మండలం యాటకల్లు గ్రామానికి చెందిన గరుడాపురం ధనుంజయ కుటుంబానికి మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలకు అండగా ఉంటారన్నారు. ఎందుకంటే అనారోగ్య బాధితులకు ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటూ ముందుకెళ్తున్నారన్నారు. ఇందులో భాగంగా ధనుంజయకు రూ.25,833 చెక్కును బాధితుడి తండ్రి బ్రహ్మయ్యకు అందజేసినట్లు తెలిపారు.

ఊడిన శ్రీచైతన్య స్కూల్ బస్సు చక్రం
తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్



చక్రం ఊడి రోడ్డు పక్కన ఆగిని శ్రీ చైతన్య స్కూల్ బస్సు

విద్యార్థులతో వెళ్తున్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్ బస్సు చక్రం ఊడిపోయింది. అయితే బస్సు ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని మల్లాపురం గ్రామ సమీపంలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని బళ్లారిరోడ్డులో శ్రీచైతన్య టెక్నో ప్రయివేటు పాఠశాల ఉంది. రోజు మాదిరే సోమవారం ఉదయం శ్రీచైతన్య టెక్నో పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను ఎక్కించుకుని మండల పరిధిలోని పీటీఆర్‌పల్లి గ్రామం నుంచి వర్లి, భట్టువానిపల్లి, దురదకుంట, పాలవాయి, మల్లాపురం మీదుగా పాఠశాలకు బయల్దేరింది. బస్సు వెళ్తున్న సమయంలో బస్సు వెనుక చక్రం ఒకటి ఊడిపోయింది. ఒక్కసారిగా బస్సు అదుపు తప్పడంతో విద్యార్థులు కేకలు వేశారు. వెంటనే డ్రైవర్ అప్రమత్తం అయ్యి బస్సును రోడ్డు పక్కకు ఆపేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పిపోయింది. ఈ విషయంపై ఆర్టీవో రమేష్‌బాబును స్పందించారు. ఇదివరకే ప్రయివేటు పాఠశాల బస్సుల యాజమాన్యులు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించి బస్సుల భద్రతపై చర్చించామని, మరోసారి బస్సుల కండీషన్లను పరిశీలించి తగుజాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

మన్నీల జెడ్పీ హైస్కూల్‌లో మరుగుదొడ్లు నిర్మించాలి

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం రూరల్ మండలం, మన్నీల గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే మరుగుదొడ్లు నిర్మించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మన్నిల రామాంజినేయులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు టాయ్‌లెట్లు, బాత్రూమ్‌లు నిర్మించాలన్నారు. మన బడి - మన భవిష్యత్ క్రింద మంజూరైన బాత్‌రూమ్‌లు, టాయిలెట్‌లలో నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ప్రహరీ గోడ కూలిపోయి మరమ్మతులకు గురైందన్నారు. తక్షణమే మరమ్మత్తులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, త్రిలోక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి పీడీగా చల్లా లలితమ్మ




శింగనమల : జిల్లా ఇన్‌ఛార్జి పీడీగా శింగనమల సిడిపిఒ చల్లా లలితమ్మ నియమితులయ్యారు. మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీగా విధులు నిర్వహిస్తున్న అరుణకుమారి సుపరిపాలన కార్యక్రమానికి ఢిల్లీ వెళ్లడంతో ఆమె స్థానంలో లలితమ్మకు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా అనాథ పిల్లలకు హెల్త్ కార్డుల పంపిణీలో పాల్గొన్నారు.

'అ ఆ'తో సంపూర్ణ అక్షరాస్యత

తాడిపత్రి : అక్షర ఆంధ్ర (అ ఆ) కార్యక్రమం తాడిపత్రి పురపాలక ఘనతకు దిక్సూచి అవుతుందని మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ అన్నారు. సోమవారం తాడిపత్రి పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్షావలితో కలిసి ప్రారంభించారు. ఇందులో భాగగా అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ ఉష కార్యక్రమ ముఖ్య ఉద్దేశం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అక్షర ఆంధ్ర కార్యక్రమంతో చదువు లేని వారికి చదువు నేర్చుకునేందుకు మంచి అవకాశం అన్నారు. తాడిపత్రి పురపాలక సంఘంలో ఆరు వేల మంది వయోజన విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. వీరికి విద్యను బోధించేందుకు 600 మంది వాలంటీర్ టీచర్లను నియమించినట్లు తెలిపారు.

జిఎస్ డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపిడిఒగా ఎం.ఏకాంబరేశ్వరయ్య



బెలుగుప్ప : జిఎస్ డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపిడిఒగా ఏకాంబరేశ్వరయ్య సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి పెద్దన్న, ఎంపిడిఒల సత్యనారాయణ, టిడిపి నాయకుడు మల్లికార్జున, తదితరులు ఏకాంబరేశ్వరయ్యకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎలు సిబ్బంది పాల్గొన్నారు.

10న 'రాజ్యాంగం'పై సదస్సు

అనంతపురం : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10వతేదీన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని న్యాయ శాస్త్ర విభాగంలో 'భారత రాజ్యాంగాన్ని అర్థం చేసుకుందాం, కాపాడుకుందాం' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎం.గేయానంద్, ప్రధానవక్తగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎ.చంద్రశేఖర్ హాజరు కానున్నట్లు తెలిపారు.

ఆర్‌ఎంపి డాక్టర్లకు గుర్తింపునివ్వాలని దీక్షలు

పామిడి : ఆర్‌ఎంపి వైద్యలకు గుర్తింపు ఇవ్వాలని సోమవారం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్‌లో జైభీమ్ రావు భారత్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జై భీమ్‌రావు భారత్ జిల్లా అధ్యక్షులు రామప్పనాయక్, భారతీయ భీమ్‌సేన వ్యవస్థాపక అధ్యక్షులు జై భీమ్ రామాంజనేయులు, ఐఎంఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు వంక రాజు కాలువ వెంకటేష్, ఆర్.ఎం.పి డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ మస్తానయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆరోగ్య రక్షకులకు న్యాయం జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపి డాక్టర్లు నాగ మల్లారెడ్డి, రాము, శ్రీనివాసరావు, అస్లాం ఖాన్, దాదావలి, ఖలందర్, ఓబుళపతి, కొండాపురం సుదీర్, బిబిఎస్ నియోజకవర్గ అధ్యక్షులు సురేష్, సరస్వతి, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

గుంతకల్లు : ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రైతులు పండించిన అరటి, పత్తి, మొక్కజొన్న, ఉల్లిగడ్డలు వంటి పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆర్‌డిఒ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రఘునాథరెడ్డి, రాందాస్, షేక్షావలి, బాషా, నారాయణ, రామాంజి పాల్గొన్నారు.

ఎస్‌టియు నూతన కమిటీ ఎన్నిక

పామిడి : స్థానిక నాగిరెడ్డి కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎస్‌టియు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా యాదవ రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా సి.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.ఆగులూరప్ప, కార్యదర్శులుగా వీరాంజనేయులు, ఎన్.నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా శ్రీనివాసరాజు, ఆర్థిక కమిటీ సభ్యులుగా ఎన్.చంద్రమోహన్ కె.రామాంజనేయులు, డి.కుళ్లాయప్ప, మహిళా కన్వీనర్‌గా యు.సుభాషిని, సిపిఎస్ కన్వీనర్‌గా ఆర్.రోజు మేరీ, జిల్లా కౌన్సిలర్‌గా ఎ.నాగభూషణం, వి.రాజశేఖర్, వి.చంద్రశేఖర్, కె.సుధాకర్‌ను నియమించారు.

యలగలవంకను పంచాయతీగా మార్చాలని వినతి

బెలుగుప్ప : మండల పరిధిలోని యలగలవంక గ్రామాన్ని గ్రామ పంచాయతీగా మార్చాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు సోమవారం అనంతపురంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యలకలవంక ప్రజలు తిమ్మరాజు, లేపాక్షి, శ్రీనివాసులు, నాగవేణి, మంజునాథ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు

పెద్దపప్పూరు : పిల్లలందరికీ ఈనెల 21వతేదీన పిల్లలు అందరికీ పోలియో చుక్కలు వేయాలని డాక్టర్ తమ్మినేని ప్రీతి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమంపై వ్యాక్సినేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రమీల, ఆరోగ్య పర్యవేక్షకులు శర్మస్‌వలి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పి, సూపర్వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-గుత్తి



వినతిపత్రం అందజేస్తున్న పైమాలవాడ వాసులు

మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు పైమాల వాడలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. సోమవారం కాలనీవాసులు మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కాలనీలో తాగునీటి సమస్యతో పాటు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ వార్డు ప్రజలు మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ 2006 సంవత్సరంలో సత్యసాయి వాటర్ పైప్‌లైన్ వేసిన కానీ ఇప్పటి వరకు ఆ పైపుల ద్వారా నీటి సరఫరా చేయలేదన్నారు. పైపులైన్ పనులను పూర్తి చేసి నీటిని సరఫరా చేయాలని, ట్యాంకర్లు కూడా పైకి రావడం లేదన్నారు. నెలకు ఒకసారి నీళ్లు వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే వార్డులో నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా పైమాల వీధిలో రోడ్లు, వీధిలైట్లు వంటి అనేక సమస్యలు కూడ ఉన్నాయని వాటిని కూడా పరిష్కరించాలని కోరారు. కమిషనర్ స్పందించి త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు యు.మల్లికార్జున, చిన్న వెంకటేష్, పరమేష్, బేల్దారి చంద్ర, చింతలయ్య, కె.రాజు, రంగా, నీలావతి, లక్ష్మీదేవి, లాలెమ్మ, కమల, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుత్తి



గుత్తిలో పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆశా కార్యకర్తల యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి నాగమణి, ఉపాధ్యక్షురాలు ప్రమీల, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సి.రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బేతాపల్లి పీహెచ్సీలో అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు కనీస వేతనం చెల్లించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా మార్పు చేయాలన్నారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్యకర్తలకు సెలవులు లేక వారు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అన్ని రకాల సెలవులు, దహన సంస్కారాలకు డబ్బును ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలకు ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తల యూనియన్ నాయకురాళ్లు దస్తగిరమ్మ, లక్ష్మి, వరలక్ష్మి, రాజేశ్వరి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మిక సంఘం యూనియన్ జిల్లా కోశాధికారి వన్నూరుస్వామి ఆధ్వర్యంలో సోమవారం అఖిల భారత సిఐటియు మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆటో కార్మికులు, ఉపాధి హామీ కూలీలు, వడ్డెర్ల సంఘం కార్మికులు నాగరాజు, గోవిందు, నాగేంద్ర, గంగన్న, మారెన్న, ఈరన్న, రామచంద్ర, సిఐటియు అనుబంధం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాయదుర్గం

గుమ్మఘట్ట మండలం పూలకుంట అయ్యప్ప నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బషీర్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హెచ్‌ఎం ఇక్కడ విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం పరిపాటిగా మారిందన్నారు. అంతేకాకుండా నియంతలా వ్యవహరిస్తూ విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనం అందించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఎవరైనా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారిపై విరుచుకుపడుతున్నాడన్నారు. మరుగుదొడ్లను కూడా వాడుకోకుండా చేయడం బాధాకరమన్నారు. వెంటనే హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

యాడికి : ప్రధానమంత్రి సురక్షిత మాతృత అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని రాయల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త రంజిత్‌కుమార్ ఉచిత భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ దేవరాజన్, డాక్టర్ అప్పయ్య, పిహెచ్ఎన్ గంగాదేవి, మేల్ సూపర్‌వైజర్ షబ్బీర్‌అహ్మద్, ఎఎన్ఎంలు పాల్గొన్నారు

కోటి సంతకాల సేకరణ

గుత్తి : వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయటాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో గుత్తిలో సోమవారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వి.వరదరాజులు, 7వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కెఎం.రంగనాయకులు, నాయకులు అరుణ్‌కుమార్, పద్మారెడ్డి, భాస్కర్ బాబు, రవితేజ, నరసింహులు, రాజారాం, అఖిల్, సలీం, చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి : విప్ కాలవ

ప్రజాశక్తి-కణేకల్లు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ కాలవ

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. రూరల్ బ్యాంకు అధ్యక్షులు వాల్మీకి నాగార్జున, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ఎస్‌కె మల్లికార్జున ఆధ్వర్యంలో మండల పరిధిలోని హనకనహల్ గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం రూ.15లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాయదుర్గ నియోజకవర్గంలో చిన్నపాటి గ్రామాలను కూడా అభివృద్ధి చేయడం ఒక్క టిడిపికే సాధ్యమన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారినా గ్రామాలు అభివృద్ధి చెందలేదన్నారు. అయితే 2014 నుంచి 19 వరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆ నమ్మకంతోనే 2024లో ప్రజలు తిరిగి అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వన్నారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి సుజాత, వేలూరు మరియప్ప, జిన్నా బాబు, ఆనందరాజ్, లాలెప్ప, సుదర్శన్, చాందు, విజయ్, మాజీ డీలర్ వెంకటేష్‌లు, మారెప్ప, తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతి సెంటర్‌ను గోళ్లలోనే ఉంచాలని వినతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

దశాబ్దాలుగా కొనసాగుతున్న హోమియోపతి వైద్యసెంటర్ మండల పరిధిలోని గోళ్ల గ్రామంలోనే కొనసాగించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈమేరకు ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలుకా అధ్యక్షుడు చెలిమప్ప, నాయకులు తిప్పేస్వామి, నాగభూషణం, రామాంజినేయులు, తదితరులు సోమవారం రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్‌డిఒ వసంతబాబుకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయూష్‌మాన్ సెంటర్‌ను ఉన్నఫలంగా అనంతపురం రూరల్ మండల పరిధిలోని కుర్రగుంటలోని సెంటర్‌లో కలపడం బాధాకరమన్నారు. దీనివల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు.కావున తిరిగి గోళ్లలోనే సెంటర్‌ను నిర్వహించాలని కోరారు.

విత్తనకాయలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-బెలుగుప్ప

రబీలో బోరు బావులు కింద పంటలు సాగు చేసే రైతులు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ కాయలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి పృథ్వీసాగర్ సూచించారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 300 కింటాళ్ల వేరుశనగ కాయలకు మంజూరైనట్లు తెలిపారు. కావాల్సిన రైతులు తీసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు మల్లికార్జున, మాజీ ఎంపిటిసి కంచరాముడు, ఎంపిఇఒలు తిమ్మారెడ్డి, నాగమణి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : రబీ సీజన్‌లో బోరు బావుల కింద సాగు చేసే రైతులకు సబ్సిడీ వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అహ్మద్‌బాషా తెలిపారు. ఈమేరకు సోమవారం మండల పరిధిలోని జుంజరంపల్లి గ్రామంలో వేరుశనగ పంపిణీని చేశారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు మీ పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో రాయితీ వేరుశెనగ విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘంలో పని చేస్తూ విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు తోటి కార్మికులు ఆర్థికసాయం అందించారు. అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులుగా పని చేసిన ఎస్.కొల్లప్ప, డి.మల్లికార్జున, పి.శ్రీనివాసులు అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. దీంతో కార్మికులు అందరూ ఒక్కరోజు వేతనం విరాళంగా వచ్చిన మొత్తాన్ని ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున కమిషనర్ దివాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్రతో అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు తిప్పేస్వామి, మల్లేసి, అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు వన్నూరప్ప, మైలారి, రమేష్ కార్యదర్శి రాము, కోశాధికారి తిప్పేరుద్ర కమిటీ సభ్యులు ఆదిలక్ష్మి, వన్నూరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

ప్రజాశక్తి-అనంతపురం

అర్హత ఉన్న కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ అందజేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి వెంకటేషులు డిమాండ్ చేశారు. సోమవారం విడపనకల్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న కౌలు రైతులందరికీ బ్యాంకు ద్వారా పంట రుణాలు, అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయాలన్నారు. కౌలు రైతులు అప్పు చేసి కంది, పప్పుశనగ, మిరప పంటను సాగు చేశారన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కావున కౌలు రైతులందరికీ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ఇవ్వాలని, సిసిఆర్‌సి కార్డులు ఉన్న వారందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నాయకులు సుంకన్న, రామాంజనేయులు, శివమ్మ, సుంకన్న, సోమప్ప, రామాంజిని, దుర్గప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎఐపై సాంకేతిక శిక్షణ

అనంతపురం : అనంతపురంలోని పివికెకె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఐబిఎం, ఐసిటి అకాడమీ సంయుక్తంగా ఆర్టిఫిషియల్ టెక్నాలజీ (ఎఐ)పై సోమవారం సాంకేతిక శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ఐసిటి అకాడమీ స్పోక్ బి.వెహిదా పర్వీన్ కార్యక్రమం లక్ష్యాలు, ప్రయోజనాలను వివంచారు. పరిశ్రమకు అనుగుణంగా రూపొందించిన మాడ్యూల్స్ విద్యార్థులకు గ్లోబల్ సర్టిఫికేషన్లతో పాటు అత్యుత్తమ నైపుణ్యాలను అందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పివికెకె కళాశాల ఛైర్మన్ కిషోర్ పల్లె, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డీన్ భానుకిరణ్, ఐసిటి అకాడమీ రీజినల్ మేనేజర్ ప్రవీణ్, ట్రైనర్ శ్రీ నిథిన్ శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ 'పది' మోడల్ పరీక్ష పత్రాలు విడుదల

అనంతపురం : యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదవ తరగతి పరీక్ష పత్రాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు జగదీష్, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎండి ప్రసాద్ కోరారు. ఈమేరకు యుటిఎఫ్ నాయకులతో కలిసి సోమవారం వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మోడల్ పరీక్ష పత్రాలు ఉపయోగ పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు శ్రీధర్, గిరిధర్, వార్డ్ సభ్యులు ముల్లా లాలూ, సాహెబ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.